# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 09 జూలై, 2026 | పేజీలు : 08





## విద్యార్థులకు నాణ్యమైన బోధన,
# రుచికరమైన భోజనం

### కలెక్టర్ కె.హరిత



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:** ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మధ్యాహ్న భోజనంలో రుచికరమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. కాగజ్ నగర్ పట్టణంలోని పాత ప్రభుత్వ ఉన్నత ప్రధానమంత్రి శ్రీ పాఠశాలను అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూత్రశాలలు, మరుగుదొడ్లకు వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, కాలంచెల్లిన నిత్యవసర సరుకులను వినియోగించకూడదని, వంటశాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రాంగణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్య, మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత పట్టణంలోని త్రిశూల్ పహాడ్ లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్వయం ఉపాధి, క్యాంపస్ ప్లేస్ మెంట్ పై ఇస్తున్న శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తులు, సాదా బైనమా దరఖాస్తుల ప్రక్రియ, కార్యాలయ రికార్డులు, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను తనిఖీ చేశారు. దరఖాస్తుల సంబంధిత అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిచూసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, కుల, ఆదాయ, నివాస వంటి వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో నాయబ్ తహసిల్దార్ సరిత, మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వేగవంతం

### కలెక్టర్ బి. సత్యప్రసాద్



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం,ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్ ,ఎలాంటి జాప్యానికి తావు లేకుండా పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఈ భవనాలు కీలకమని పేర్కొంటూ, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణాలను పూర్తి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము,ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, తహసీల్దార్ నీత,ఇంజినీరింగ్ అధికారులు,సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశం



- ✻ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ✻ 37 మందికి నిర్వహించిన ఇంటర్వ్యూలలో 27 మంది ఎంపిక
- ✻ జూలై 22 నుంచి హైదరాబాద్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ
- ✻ ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్న సంస్థ
- ✻ శిక్షణ అనంతరం ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యకు అవకాశం
- ✻ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూలలో 27 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన మొత్తం 37 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) పెద్దపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) మంథని, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) పెద్దపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) గోదావరిఖని, ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మారం, మైనారిటీ జూనియర్ కళాశాల (బాలికలు) మంథని, మోడల్ స్కూల్ధర్యాపూర్ తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ నుంచి హైదరాబాద్‌లో మూడు నెలల పాటు ఉచిత భోజనం, వసతితో కూడిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే విధంగా ఈ శిక్షణ ఉండనున్నదని చెప్పారు.శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఉన్నత విద్యను కొనసాగించేందుకు కూడా కంపెనీ అవసరమైన సహకారం అందించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలను జిల్లాకు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు.ఉద్యోగాలకు ఎంపికైన 27 మంది విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించి, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి సంస్థలో మంచి ప్రతిభ కనబరచడంతో పాటు తమ కుటుంబాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన,జిల్లా యువజన క్రీడల అధికారి సురేష్,గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్ ఎం. ప్రభాకర్ రావు, హెచ్ఆర్ ప్రతినిధి ఖలీల్ పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేములవాడ రాజన్న ఆలయం నుండి బ్రిడ్జి వరకు విస్తరిస్తున్న ఈ రోడ్డు పనుల ప్రగతిని ఆయన అధికారులతో కలిసి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. భక్తులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా వేగం పెంచాలని, ప్రజలకు త్వరలోనే ఈ రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో పార్ట్ -టైమ్ ఉపాధ్యాయుల కోసం దరఖాస్తు




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల )లో గంటల ప్రాతి పదికన (పార్ట్ టైమ్) బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుంకరి రవి ఒక ప్రకటనలో తెలిపారు .6నుంచి 8 వ తరగతి వరకు విద్యార్థులకు సాంఘిక శాస్త్రం సబ్జెక్ట్‌ను బోధించేందుకు ఉపాధ్యాయులు అవసరమని పేర్కొన్నారు.అభ్యర్థులు డిగ్రీలో సోషల్ స్టడీస్ తో పాటు బి ఎడ్ అర్హత కలిగి ఉండాలి . టెట్ అర్హత సాధించిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు .అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు విద్యార్హతల జిరాక్స్ ప్రతులను జూలై 12 వరకు గొల్లపల్లి మోడల్ స్కూల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు .డెమో ఆధారంగా అభ్యర్థులు ఎంపిక ఉంటుంది .ఈనెల 13 న ఉదయం 10 గంటలకి డెమో క్లాసులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

## గోదావరి నదిలో పూజారి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దడి గ్రామంలో గంగామాత,రామాలయాల్లో పూజలు నిర్వహిస్తున్న ప్రణవ నరహరి (28) ఈ నెల 5న రామాలయానికి వెళ్లి అదృశ్యమయ్యాడు.దీంతో ఆయన తండ్రి దత్తాత్రేయ ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా,బుధవారం ఎర్దండి గ్రామ శివారులోని గోదావరి నదిలో నరహరి మృతదేహం గుర్తించినట్లు ఎస్సై జి. నవీన్ కుమార్ పేర్కొన్నారు. పూజారి నరహరి మానసిక స్థిరత్వం సరిగా లేక దారి తప్పి నదిలో పడి, ఈత రాక మునిగి మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని తండ్రి దత్తాత్రేయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మనస్తాపంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:**జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని బొమ్మల మేడిపల్లి గ్రామానికి చెందిన కాశబోయిన అరుణ్ (35) భార్యతో జరిగిన కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం ఎస్సై జి.నవీన్ కుమార్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల మేరకు పది రోజులుగా భార్య రోజా పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉండటంతో కలత చెందిన అరుణ్ ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని. మృతుడి మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి 18న స్పెషల్ లోక్ అదాలత్




ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** చెక్ బౌన్స్ కేసుల్లో సత్వర న్యాయం అందించేందుకు ఈ నెల 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఇంచార్జి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ లోక్ అదాలత్ విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వారెంట్లు పెండింగ్‌లో ఉన్న కేసుల్లో పోలీసులు చొరవ తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సీఐ, ఎస్ఐ లకు సూచించారు.పరస్పర రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాలకు సత్వర న్యాయం అందడంతో పాటు కోర్టులపై పెండింగ్‌లో ఉన్న కేసుల భారం కూడా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని చెక్ బౌన్స్ కేసుల్లో ఇరుపక్షాలు రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఇంచార్జి జూనియర్ సివిల్ జడ్జి కాసుల్ల పావని, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్యా రాజారాం,అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, లోక్ అదాలత్ సభ్యులు వద్దేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య,గంట్ర ప్రవీణ్ రావు,ఏలేటి నరేందర్ రెడ్డి,గడ్డం శంకర్ రెడ్డి, ఎలాల మధుసూదన్ రెడ్డి,వేముల సునీల్,బక్కూరి రమేష్,తెడ్డు ఆనంద్,సీఐ సురేష్,ఎస్సైలు కిరణ్ కుమార్,అనిల్ కుమార్, నవీన్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## తండాలో నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని ఏడుమోటలపల్లి తండాలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో సుమారు రూ.2.70 లక్షల వ్యయంతో నూతన బోర్‌బావి తవ్వించి, మోటార్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మంగళవారం ఈ తాగునీటి వసతిని గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని అన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.గిరిజన తండాల సమగ్ర అభివృద్ధికి మంత్రి ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ మండలంలోని మూడు గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.66 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు.తాగునీరు,రహదారులు,విద్యుత్, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మ్యాక శ్రీవాణి–సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్, ఉప సర్పంచ్ అజ్మీర రజిత కుమార్, మార్కెట్ డైరెక్టర్ చాట్ల విజయభాస్కర్, కిషన్,మాజీ సర్పంచ్ రవి నాయక్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల విష్ణు,కాంగ్రెస్ నాయకులు మ్యాక తిరుపతిరెడ్డి, పూసాల తిరుపతి,కట్ల సత్తయ్య, వార్డు సభ్యులు లచ్చ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని బొంకూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గ్రామానికి చెందిన మోకనపల్లి లక్ష్మి స్వామి ,ముల్కల మల్లవ్వ లచ్చయ్య నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది .ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్న ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందించడంలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు నిలువ నీడలేని పేదవారికి తరతరాలుగా నిలిచిపోయే గొప్ప పథకం అని కొనియాడారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ తమలాంటి పేద కుటుంబాలకు రూ.5 లక్షలతో సొంతింటి కలను సాకారం,చేసిన ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు . కాంగ్రెస్ పార్టీకి తమ కుటుంబం ఎప్పుడు రుణపడి ఉంటుందని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముల్కల శిరీష శ్రీనివాస్,ఉప సర్పంచ్ శ్రీధర్,సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్ ,మండల ప్రధాన కార్యదర్శి జెల్లా అనిల్,లోత్తునూర్ సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్,బీమ్ రాజ్ పల్లి సర్పంచ్ శిరీష గంగ చారి ,కాంగ్రెస్ నాయకులు సాగర్ ,బెల్లం గంగారం,గ్రామ కార్యదర్శి మామిడి ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు .

## గ్రామాభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు అవగాహన

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బిపిడిపి/జిపిడిపి)పై బుధవారం అధికారులు అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో 16వ ఆర్థిక సంఘం నిధులను సమర్థంగా వినియోగించేందుకు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని పంచాయతీ అధికారి అంబటి వెంకట రామకృష్ణారాజు సూచించారు.అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) దరఖాస్తులను పూర్తి చేసే విధానంపై ఎంపిడిఓ అవగాహన కల్పించారు .సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వైద్యాధికారి డా. వనజ వివరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.ఎస్.ఎస్




వరప్రసాద్,డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్,వివిధ శాఖల సహాయ ఇంజినీర్లు, ఉద్యానవన శాఖ,అటవీ శాఖ, స్వయం సహాయక సంఘాల అధికారులు,ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,గ్రామ సంఘాల సభ్యులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మాజీ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు జెట్టి లింగం ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జెట్టి లింగం మాట్లాడుతూ, వైఎస్సార్ పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక ప్రజాహిత పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఎఎంసి డైరెక్టర్ సంగు గంగాధర్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి అందే మారుతి, బాపూజీ కార్యదర్శి ఎడ్మల లక్ష్మి రెడ్డి, ట్రస్ట్ మాజీ చైర్మన్ కొమ్ముల సంతోష్ రెడ్డి, టౌన్ మైనారిటీ అధ్యక్షుడు ఎండి ముఖీమ్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ముత్యాల రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వంగ వేణు,కాంగ్రెస్ నాయకుడు నీలి గణేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఆదివారం రోజున శ్రీ కనక సోమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రేవెల్లి నడిపి ఎల్లయ్య, రేవెల్లి గంగు ల జ్ఞాపకార్థం రూపొందించిన ఉచిత వైద్య శిబిర కరపత్రాలను బుధవారం ముత్యంపేటలో ఆవిష్కరించారు. మెట్పల్లి చెందిన మైత్రి హాస్పిటల్ ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు సమీప ప్రాంతాలకు ప్రజలు పాల్గొని విజయవంతం సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తేలు నరేష్, గ్రామస్తులు తదితరులున్నారు.

## వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం /పెగడపల్లి :** స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి .ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజాసేవ, రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం చేసిన సేవలను నాయకులు కొనియాడారు.ఈ సందర్భంగా కడారి తిరుపతి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్,సర్పంచులు,మోకినపల్లి గోపాల్, ఇస్లావత్ రమేష్ నాయక్,ఉపసర్పంచులు,మాజీ ఎంపిటిసిలు ఎలగొండ కృష్ణ హరి,మందపల్లి అంజయ్య,మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పూసాల తిరుపతి, తోట రామ్ రెడ్డి, కురిక్యాల హనుమాన్ శేఖర్, చాట్ల ప్రశాంత్,దప్పు నర్సయ్య,దుర్గాప్రసాద్, కొత్త శ్రీనివాస్, గొల్లపల్లి గంగారం,అడిగొప్పుల గణేష్,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి ఒక చెట్టు నాటాలి

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :**మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జగన్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు హరిత హారం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని, నాటిన ప్రతి మొక్కను జీవించేలా సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. మమత, ఉపసర్పంచ్ లాక్మా చిన్నయ్య,గంగ నర్సయ్య, నారాయణ,పాల్గొన్నారు.

## పట్టణ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని 17వ వార్డులో రూ.1 లక్ష వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి బుధవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, 17వ వార్డులో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే ఉద్దేశంతో ఈ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుడికందుల అజయ్,పందిరి రమేష్,ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ డిఇ ,ఎఇలక్ష్మి,ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ,మున్సిపల్ అధికారులు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా వృక్షారోపన కార్యక్రమం

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ లోని నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ ఉప ప్రాంత కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగం సహకారంతో వృక్షారోపణక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ కుమార్, సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ గోవర్ధన శ్రీనివాస రావు, 6వ డివిజన్ కార్పోరేటర్ మేకల వెంకటేశ్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపల్ , విభాగాధిపతి డా. ఎం.ఉదయ్ శంకర్, అధ్యాపకులు, ఎన్ఎస్ ఓ అధికారులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

## పేదల అభ్యున్నతే లక్ష్యం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కొనియాడారు. బుధవారం సిరిసిల్ల గాంధీ చౌ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ లు మాట్లాడారు. వైయస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే నాయకులు వైయస్సార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకునూరి బాలరాజు, బొప్ప దేవయ్య, కౌన్సిలర్ సభ్యులు బైరి ప్రభాకర్ విజయనిర్మల, శ్రీనివాస్, శ్రీశైలం, నేరెళ్ల శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్యవర్గ సమావేశం తొలి వార్షికోత్సవం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని మహాలింగేశ్వర గార్డెన్లో రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, రాజన్న సిరిసిల్ల ఉపాధ్యక్షుడు గడ్డం నరసయ్య, అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలఅధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, మున్నూరు జిల్లా అధ్యక్షులు బొప్ప దేవయ్య, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి, వరాల దేవయ్య, కూర సురేష్, మీసం రాజయ్య,కాపు సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో సంఘం బలోపేతం, సామాజిక అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాలు, యువత ప్రోత్సాహం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించారు. సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్ కార్యాచరణపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో సంఘం చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించి, సమాజ అభ్యున్నతికి మరింత కృషి చేయాలని తీర్మానించారు. వార్షికోత్సవవేడుకలనుఘనంగానిర్వహించారు.

# అట్టహాసంగా ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్:**కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆ ల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు కరీంనగర్ లో ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల సిబ్బందితో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నగరంలో పలు చోట్ల అన్నదానం,పండ్లు పంపిణీ, నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ చేశారు. గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విద్యారంగానికి ఎనలేని కృషి చేస్తున్నారని, విద్యారంగానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని పలువురు అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నరేందర్ రెడ్డి విద్యారంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధింపచేస్తూ, భారతదేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో స్థిరపరుస్తూ ఉత్తమమైన సీట్ల కేటాయింపుతో అత్యుత్తమ స్థానాన్ని కైవసం చేసుకోవడం వారికే సొంతమని హర్షం వ్యక్తం చేశారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించినటువంటి నరేందర్ రెడ్డి నేడు తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి ఐకాన్ గా మారడం వారి కష్టానికి ప్రతిఫలమని, రాజకీయాల్లోనూ సైతం తనదైన ముద్ర వేసుకుంటూ కార్యకర్తల హృదయాల్లో స్థానం సం



పాదించుకుంటున్నారని, సౌమ్యుడైన నరేందర్ రెడ్డి ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని కోరారు. కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహాద్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక వద్ద టపాసులు పేల్చి కేక్ ని కట్ చేశారు. ప్రత్యేకంగా నరేందర్ రెడ్డి కి తలపాగాను, ఖడ్గాన్ని బహుకరించారు. ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో కమాన్ సమీపంలో అన్నదానం, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మునిగంటి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ దగ్గర అన్నదానం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో చింతకుంటలో కేక్ కటింగ్, దేశ్రాజ్ పల్లి లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ చౌక్ లో నిర్వహించిన కార్యక్రమానికి కరీంనగర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు గంట కళ్యాణి శ్రీనివాస్, రాజ్ కుమార్, అఫ్రీన్ , వరాల నరసింగం, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్యామ్ సుందర్, ఇమ్రాన్, పి శ్రీకాంత్, జిప్రశాంత్, అఖిలేష్, బి. రాహుల్, ఆసిఫ్, ఇమ్రాన్ ఘని, ఆశిష్ రెడ్డి, ఎస్‌టి సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఎన్ ఎస్ యు నాయకులు ఇమ్రాన్, అభి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి , సిటీ కార్పొరేషన్ మహిళ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, మహాలక్ష్మి , కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి

**ప్రజాపక్షం / జమ్మికుంట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి ఐక్య ఉద్యమ పోరాటాలు నిర్వహించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి అన్నారు. బుధవారం సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వాసుదేవ రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కూలీల పొట్ట గొట్టే విబిజి రాంజీ పథకం రద్దు అయ్యే వరకు ఉద్యమించాలన్నారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసి కార్పోరేటర్లకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేటుపరం చేసే కుట్రలో భాగంగా మూడవ తెస్తున్నారని ముమ్మాటికీ ఇది ప్రజా వ్యతిరేక చర్య అని అన్నారు. రైతు డిస్కంను 35 వేల కోట్ల రూపాయలు విద్యుత్ బకాయిలు వేశారని ప్రభుత్వ బిల్లింకు మిషన్ భగీరథ, సోలార్‌కు, రైతులకు ఉచిత విద్యుత్ కోసం అంటూ ప్రజలను మభ్యపెడుతన్నారని అన్నారు. రైతులకు భవిష్యత్‌లో ఉచిత విద్యుత్ అనేది అందనీ ద్రాక్షగా మారే ప్రమాదం ఉంది కాబట్టి విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్‌ను ప్రైవేట్‌పరం కాకుండా ప్రభుతవ ఆధీనంలో ఉండేవిధంగా ఉద్యమించాలన్నారు. యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, 33 వరి వంగడాలను సన్న రకం కింద నోటిఫై చేసి తీరా సీజన్ ప్రారంభమైన తర్వాత కేవలం 7 రకాల వంగడాలు మాత్రమే పండించిన వారికి బోనస్ చెల్లిస్తామనడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యాన్ని పేదలకు అందించడంలో పూర్తిగా విఫలమైందని పేదలకు ఉచిత విద్యతో పాటు వైద్య సేవలు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తించి వెంటనే ప్రభుత్వం మెరుగైన విద్య, వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట ప్టమంలో పలు కాలనీలలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని వర్షాకాలం ప్రారంభమైనా పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చోద్యం చూస్తున్నారని వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీవాసుల దశాబ్దాల కన్నీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ కార్యదర్శి జక్కుల రమేశ్ యాదవ్, మండల కమిటీ సభ్యులు బాసిర సంపత్ రావు, దండిగారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ

**ప్రజాపక్షం / రామడుగు :** సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ ఉంటుందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం అన్నారు. బుధవారం మండలంలోని వెలిచాల గ్రామంలో పోలీస్ మీ కోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆధునిక టెక్నాలజీ కలిగిన 40 సిసి టీవి కెమెరాలను ప్రారంభించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శాంతి భద్రతల పరిరక్షణలోసిసిటివి కెమెరాలు కీలకపాత్ర పోశిస్తాయని వివరించారు. రానున్న రోజుల్లో కమీషనరేట్ పరిధిలో లోపాలను అధిగమిస్తూ మరో 700 కొత్త కెమెరాలను అమర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్ కుమార్ యాంటీ నార్కోటిక్ యూనిట్ ఇన్స్‌పెక్టర్ రఫీక్, రామడుగు ఎస్సై రాజు, స్థానిక సర్పంచ్ వీర్ల నర్సింగ రావు, స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాధికారిని కలిసిన టిఆర్‌టిఎఫ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీరామ్ మొండయ్య ను టిఆర్ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం తెలిపారు. విద్యార్థుల సంఖ్యను పరిగణలోనికి తీసుకుని ఉపాధ్యాయుల సర్దుబాటులో నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా జరపాలనీ జిల్లా విద్యాధికారిని కోరారు. ఈ సందర్భంగా టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత సంవత్సరం జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా అమలు కాకపోవడం వల్ల అనేక మంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. కావున ఈ విద్యా సంవత్సరంలో సర్దుబాట్లు చేపట్టే సమయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ రాష్ట్ర కార్యదర్శి ఆసాని అనిల్ రెడ్డి,రాష్ట్ర కౌన్సిలర్ లు మామిడాల రమేష్,గోలి రాధాకిషన్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు గుగులోతు రమేష్, బూట్ల శ్రీనివాస్, కోల వినయ్ కుమార్, సుల్తాన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ వ్యాన్ అడ్డుకున్న సర్పంచ్ భర్త

**ప్రజాపక్షం/శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కాచాపూర్ గ్రామంలో బుదవారం విద్యార్థులను ప్రైవేట్ స్కూల్‌కు పంపేది లేదని ఓ ప్రైవేట్ పాఠశాల వ్యానును కాచాపూర్ సర్పంచ్ ఊకంటి మాధవి భర్త మధుకర్ అడ్డుకున్నారు.ఆ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడంతో పాఠశాలను మూసి వేసే ప్రమాదం ఉందని,పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆవేదనతో స్కూల్ వ్యానుకు అడ్డంగా కూర్చున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న ప్రైమరీ పాఠశాల విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తే పాఠశాల మూసివేయాల్సి వస్తుందని అన్నారు.పాఠశాల పునః ప్రారంభమైనప్పుడు 36 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వచ్చారని,ప్రైవేట్ పాఠశాలల జోక్యంతో 18 మంది విద్యార్థులు తిరిగి ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి పాఠశాల మూసివేస్తే ప్రైవేట్ పాఠశాలలో చదివే స్తోమత లేని విద్యార్థులు సుమారు.11 మంది ఉన్నారని వారి పరిస్థితి ఏంటాని ఆయన ప్రశ్నించారు.ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వచ్చి నిరుపేద కుటుంబంలోని 11 మంది విద్యార్థులను ఫీజులు లేకుండా వారి పాఠశాలలలో చేర్చుకుంటే తమకేమి అభ్యంతరంలేదని చెప్పారు.ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం వచ్చి సమస్యకు పరిష్కారం చెప్పేవరకు ఇక్కడి నుంచివెళ్లనని భీష్మించుకొని కూర్చున్నారు.విషయం పోలీసుల వరకు వెళ్లడంతో కేశవపట్నం ఎస్ఐ చొరవ తీసుకొని ఇరువర్గాలకు వేదిక కల్పిస్తానని ఇరువురు మాట్లాడుకొని సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.దీంతో సర్పంచ్ భర్త వెనక్కి తగ్గారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థినీలకు టిసిఎస్‌లో ఉద్యోగాలు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** ప్రతిష్టాత్మక టిసీఎస్2026 నియామకాల్లో ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరీంనగర్ కు చెందిన 11 మంది విద్యార్థినీలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినీలకు నాణ్యమైన విద్యతోపాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని అన్నారు. విద్యార్థినీల కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకులు అంకితభావం కలిసి ఇలాంటి విజయాలను అందిస్తామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరింత మంది విద్యార్థినీలు దేశంలోని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేలా ఆల్ఫోర్స్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం ఆయన ఎంపికైన విద్యార్థినీలను అభినందించి సన్మానించారు. వారి తల్లిదండ్రులతోపాటు అధ్యాపక బృందం, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమానికి టాస్క్ ప్రాంతీయ సమన్వయకర్త గంగాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఎంపికైన విద్యార్థినీలను అభినందించారు. ఉపాధి అవకాశాల కల్పనలో ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విశేష కృషి చేస్తోందని ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ , ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్, అధ్యాపకబృందం,విద్యార్థినీలుతల్లిందండ్రులుపాల్గొన్నారు.

## వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ప్రతి వర్షాకాలంలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని బాలకిషన్‌నగర్ ప్రధాన రహదారి (మాసం సత్తయ్య గోదాం రోడ్)పై మురికి కాలువ నీరు సజావుగా వెళ్లేలా నిర్మించనున్న నూతన కల్వర్టు పనులకు మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి కౌన్సిలర్లు, అధికారులతో కలిసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రతి వర్షాకాలంలో రహదారులపై నీరు నిలిచి స్థానిక ప్రజలు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.డ్రైనేజీ నీరు ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా ప్రవహించేలా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా,నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు..13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, ఇతర కౌన్సిలర్లు,మున్సిపల్ డిఇ, ఎఇ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది,వార్డు మహిళలు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం పూర్తిస్థాయిలో సంసిద్ధం

**అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు సమాచారం అందిస్తే సహాయక చర్యలు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదలు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ఆర్.ఐ ఆధ్వర్యంలో 12 మంది సభ్యులతో కూడిన జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. బుధవారం నాంపెల్లి గ్రామ చెరువులో భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ఈసందర్భంగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సభ్యులతో కలిసి రెస్క్యూ బోటులో ప్రయాణించి, సహాయక చర్యల నిర్వహణను పరిశీలించారు.అనంతరం డిఆర్ఎఫ్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను రక్షించేలా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జిల్లా పోలీసులతో పాటు జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం కూడా తక్షణమే సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. జిల్లా డిఆర్ఎఫ్ బృందం వద్ద రెస్క్యూ బోటు, మోటార్, మెడికల్ స్ట్రెచర్, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, వుడ్ కట్టర్ యంత్రాలు తదితర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం, డిఆర్ఎఫ్ బృందం 24×7 అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఎవరైనా ఆపదలో ఉన్నట్లు



గమనించినా లేదా సహాయం అవసరమైనా వెంటనే స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ వీరప్రసాద్, ఆర్.ఐ అడ్మిన్ సురేష్, ఆర్.ఎస్.ఐ లు సాయి కిరణ్, శ్రావణ్ యాదవ్, డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ ఫౌండేషన్ కు నిత్యావసర సరుకుల వితరణ





**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ గూడెం గ్రామంలో అమ్మ ఫౌండేషన్ ను బుధవారం సర్ధాపూరు 17వ పోలీస్ బెటాలియన్ డీస్పీ రాందాస్, సీఐ కుమారస్వామి, బెటాలియన్ పోలీస్ సిబ్బంది సందర్శించారు. ఎందరో వృద్ధులు అభాగ్యులను ఆదరిస్తున్న అమ్మ ఫౌండేషన్ స్థాపించిన మహిళాల ను అభినందించారు. 17 బెటాలియన్ తరపున అమ్మ ఫౌండేషన్ కు నిత్యవసరాలు సరుకులతో పాటు 3000 రూపాయల నగదును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటిపల్లి శంకర్, డి.ఎస్.పి రామదాసు, సీఐ కుమారస్వామి, ఎస్సై బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/ముత్తారం :** హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన రత్నం శైలజకు,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 1.25 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు చేశారు.హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ ఆర్థిక సహాయాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## రైతు భరోసా పెట్టుబడి సాయం బ్యాంక్ ఖాతాలో జమ

**సంగీతం శ్రీనివాస్ నాగుల సత్యనారాయణ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసానిధులను రైతు ఖాతాలో ఎలాంటి పరిమితి లేకుండా అర్హులైన ప్రతి రైతులందరికీ పెట్టుబడి సాయం వారి వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రైతు భరోసా నిధులను విడుదల చేసినందుకుగాను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సిరిసిల్ల గాంధీ చౌక్ లో సీఎం రేవంత్ రెడ్డి కి సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్, సత్యనారాయణ గౌడ్, సూర దేవరాజు లు మాట్లాడారు. జూలై 4, 2026 నాటికి 67.44 లక్షల మంది రైతులకు, 1.18 కోట్ల ఎకరాలకు, రూ. 7,135.77 కోట్ల రైతు భరోసా నిధులు చిన్న సన్నకారు రైతులకు నేరుగా వారి వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేసామని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యంగా వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా ప్రజా ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేసిందన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడతల వారీగా విడుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడతల వారీగా ప్రభుత్వం విడుదల చేయడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకునూరి బాలరాజు, బొప్ప దేవయ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ లు శ్రీనివాస్, పోయేది ప్రభాకర్ విజయనిర్మల, శ్రీశైలం, శ్రీకాంత్ గౌడ్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' స్వయంగా దరఖాస్తు సమర్పించిన సర్పంచ్ ఎలమట్ల హరీష్!

**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగుతోంది. ప్రజాస్వామ్య బలోపేతమే లక్ష్యంగా సాగుతున్న ఈ బృహత్తర కార్యక్రమంలో ఈరోజు బీర్పూర్ గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్ స్వయంగా భాగస్వామ్యమయ్యారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉన్న బీఎల్ఓ సిబ్బందిని కలిసి,దరఖాస్తు ఫారంలో తన పూర్తి వివరాలను నమోదు చేసి అధికారులకు అందజేశారు.





ఓటు హక్కు మన భవిష్యత్తుకు మార్గదర్శి సర్పంచ్ ఎలమట్ల హరీష్ : ఈ సందర్భంగా సర్పంచ్ ఎలమట్ల హరీష్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడి అభివృద్ధికి, గ్రామ ప్రగతికి ఓటు హక్కు ఒక అస్త్రం లాంటిది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది అని పేర్కొన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు బాధ్యతగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి : గ్రామ ప్రజలందరూ తమ ఓటర్ కార్డులలోని తప్పుల సవరణలు, అడ్రస్ మార్పులు లేదా కొత్త ఓటు నమోదు కోసం వెంటనే దరఖాస్తులను పూర్తి చేసి, సంబంధిత బీఎల్ఓ అధికారులకు సమర్పించాలని సర్పంచ్ కోరారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు,బీఎల్ఓలు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లాలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సమీకృత ఉద్యానాభివృద్ధి మిషన్ (MIDH) పథకం కింద కూరగాయలు, పూల పంటలు, పసుపు సాగు,మల్చింగ్ షీట్లకు సబ్సిడీ అందజేయబడుతోందనీ, అలాగే సూక్ష్మ నీటిపారుదల పథకం (Micro Irrigation Scheme) ద్వారా డ్రిప్ మరియు స్ప్రింక్లర్ నీటిపారుదల వ్యవస్థల ఏర్పాటుకు కూడా సబ్సిడీ కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు.పెద్దపల్లి జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యాన శాఖ సబ్సిడీ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆయన కోరారు.అర్హులైన రైతులు తమ గ్రామ పరిధిలోని సంబంధిత హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (HEO) లేదా హార్టికల్చర్ ఆఫీసర్ (HO) ను సంప్రదించి, పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో పత్రాల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు సమర్పించాలనీ, రైతులు ఈ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల సాగును విస్తరించి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## ఓటర్ల సర్వే: సర్ సర్వే

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని అడవి శ్రీరాంపూర్, ఓడేడ్ గ్రామాల్లో గల బూత్ స్థాయిలో సార్ (Special Intensive Revision SIR) సర్వే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పీసీసీ జనరల్ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ముత్తారం మండల పార్టీ నాయకుల సూచనలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ సర్వే నిర్వహించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సర్వే కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్, బూత్ లెవెల్ ఏజెంట్ లక్కం రాజు, బిఎల్ఏలు మూగ రవీందర్, ర వీందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పంపులను ప్రారంభించి రైతులకు నీరు అందించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించి సాగునీరు విడుదల చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు నడిపెల్లి మురళీధర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. రైతులు వర్షాలు కురుస్తాయో లేదో, ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలనే సందిగ్ధంలో ఉన్నారని, కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద లక్ష క్యూసెక్కుల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం పంపులను ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అక్కడి నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి వరకు నీటిని పంపింగ్ చేస్తే శ్రీరాంసాగర్, మానేరు సహా పలు ప్రాంతాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుందని, అయినప్పటికీ ప్రాజెక్టును ప్రత్యక్షంగా పరిశీలించి నిరసన తెలిపామని చెప్పారు. ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో కరువు, రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు సాధారణమని, కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ప్రతి ఎకరాకు సాగునీరు అందించి తెలంగాణను సస్యశ్యామలం చేశారని అన్నారు. తూర్పుకు ప్రవహించే గోదావరి జలాలను పడమరకు మళ్లించిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. నిండుకుండలా మారిన గోదావరి రైతుల పొలాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, మత్స్యకారులకు ఉపాధినిచ్చిందని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల ద్వారా తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు మూడు పిల్లర్లలో పగుళ్లు ఏర్పడినప్పటికీ వాటి మరమ్మతులు చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కేసీఆర్‌కు వచ్చిన పేరును చెరిపివేయాలనే కుట్రలో భాగంగానే గోదావరిని ఎండబెట్టారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డకు మాత్రమే పరిమితం కాదని, ఇతర పంప్‌హౌస్‌లు పనిచేసే స్థితిలోనే ఉన్నాయని,సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినప్పుడు పనులు నిలిపివేయలేదని, దానికో న్యాయం, కాళేశ్వరంకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటి సరఫరా కొనసాగించవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం అంశంపై వాస్తవాలను పక్కనబెట్టి కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, అవినీతి ఆరోపణల పేరుతో అసలు సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టు మరమ్మతులు చేయడం చేతకాకపోతే తామే చేసి చూపిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికే ప్రకటించారని గుర్తుచేశారు.

## మోరపల్లి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల మండలం మోరపల్లి గ్రామంలో బుధవారం ప్రతి ఇంటింటికి చెట్ల పంపిణీ కార్యక్రమాన్ని మోరపల్లి గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్ ప్రారంభించారు. చెట్లను పెంచడం ద్వారా కాలుష్య నివారణకు చెట్లు గాలిని శుభ్రపరచడం కార్బన్ డయాక్సైడ్ ను పీల్చుకొని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయని, జీవవైవిధ్యంలో పక్షులు,జంతువులకు చెట్లు ఆవాసాలు కల్పిస్తాయని నీటి సంరక్షణ భూగర్భ జలాలు పెరిగేందుకు చెట్లు దోహదపడతాయి గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఉమే హుమేరా, ఉప సర్పంచ్ ఆగునూరి గంగా రాజం,పాలకవర్గ సభ్యులు,గణేష్,గంగాధర్,అనిల్,ప్రజా ప్రతినిధులు,గంగారం,సదానందం వెంకటేష్, వేణుగోపాల్,అంగన్వాడి టీచర్లులు,ఆశ వర్కర్లులు,ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్,గ్రామ జీపీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పాఠశాలలను సందర్శించిన కాంప్లెక్స్ హెచ్ఎం

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలంలోని పెద్దరాంపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని శ్రీలత బుధవారం కాంప్లెక్స్ పరిధిలోని గౌరారం, పెద్దరాంపూర్ గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పిల్లల, టీచర్ల అటెండెన్స్ పరిశీలించారు. గత సం.రం నమోదు, నమోదు అయిన పిల్లల సంఖ్యను పరిశీలించారు. పిల్లల నమోదు శాతం పెరిగేలా చూడాలన్నారు. వెనుకబడిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి పిల్లల ప్రగతిని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శంకర్, గంగామణి, సిబ్బంది ఎల్లయ్య, ధనుంజయ, కృష్ణారెడ్డి, సంధ్య, బసవయ్య, శ్వేత, రేఖ, సీఆర్‌పీ గోపాల్ సింగ్, ఠాకూర్ పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలంలోని అయ్యప్ప ఆలయ నూతన కార్యవర్గాన్ని బుధవారం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గంగా సందీప్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి పద్మనారాయణ, ఉపాధ్యక్షునిగా జలంధర్, నారాయణరెడ్డి, రంజిత్, శశికాంత్, సలహాదారులుగా భగవాన్, సాయిప్రసాద్, నర్సాగౌడ్, బొడ్డ రాజు, జగదీష్, శ్రీశైలం, సంతోష్‌రెడ్డి, దయాళ్‌సేట్, సతీష్‌సేట్, ఉడుగుల సంతోష్, నారాయణరెడ్డిలు ఉన్నారు. ఈ నూతన కార్యవర్గం 2 సంవత్సరాల పాటు పనిచేయనుందని వారు పేర్కొన్నారు.

### 9న జిల్లాకు షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ రాక

పిఏస్. అశోక్ కుమార్ లక్కర్సు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ ఈ నెల 9వ తేదీన జిల్లాకు రానున్నారని కమిషన్ సభ్యుల పిఏస్. అశోక్ కుమార్ లక్కర్సు ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఉదయం 11.30 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో జిల్లా సాయి సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, అధికారులతో కలిసి షెడ్యూల్డ్ తెగల రక్షణ చట్టాల అమలుపై సమీక్షించనున్నట్లు ఆయన వివరించారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలంలోని లింగయ్యపల్లె గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు పిసిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముదుగు ప్రవీణ్ మాట్లాడుతూ.. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న 18 మంది విద్యార్థులకు ఫౌండేషన్ తరఫున బ్యాగులను అందజేసినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు వామన్ కుమార్, జ్యోతి, సురేఖ పాల్గొన్నారు.

## వాంకిడిలో రూ.266 యూరియా బస్తా రూ.350కి విక్రయం

### ప్రైవేట్ ఎరువుల కేంద్రాలపై రైతుల ఆందోళన

**ప్రజాపక్షం / వాంకిడి:** వాంకిడి మండలంలోని కొన్ని ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం యూరియా బస్తా గరిష్ట చిల్లర ధరను రూ.266గా నిర్ణయించినప్పటికీ, ప్రైవేట్ డీలర్లు రైతుల నుంచి రూ.350 వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సాగు పనులు ఊపందుకోవడంతో రైతులు పెద్ద ఎత్తున యూరియా కొనుగోలు చేస్తున్నారు. ఈ అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు డీలర్లు అధిక ధరలు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు యూరియా ఇవ్వాలని అడిగితే స్టాక్ లేదని చెపుతూ, చివరకు అధిక ధర చెల్లించేలా ఒత్తిడి తెస్తున్నారని పేర్కొంటున్నారు. రైతులు రసీదు కోరితే రూ.266కే బిల్లు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని నగదుగా అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ రికార్డుల్లో యూరియా నిర్ణీత ధరకే విక్రయించినట్లు చూపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, కొంతమంది రసీదు కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు పెరిగి ఇబ్బందుల్లో ఉన్నామని, ఇలాంటి సమయంలో ఎరువులపై అదనపు భారం పడటం చిన్న, సన్నకారు రైతులను మరింత దయనీయ స్థితిలోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే మండలంలోని ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎంఆర్పీ కంటే అధిక ధర వసూలు చేస్తున్న డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వ స్థల ఆక్రమణలను తొలగించని అధికారులు

### అడ్వకేట్ ముసుగులో కబ్జా చేసినా వెనకడుగు



**ప్రజాపక్షం / చెన్నూరు:** అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ స్థల ఆక్రమణను తొలగించాలని ఏకంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెనకడుగు వేస్తుండడంపై చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జూనియర్ అడ్వకేట్ ముసుగులో ఓ ఇంటి నెంబరును ఆధారంగా చేసుకొని పట్టణ శివారులోని సర్వే నెంబర్ 631లో గల కోట్లాది రూపాయల విలువైన ఎకరంన్నర ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై ప్రజాపక్షం దినపత్రికలో ఇటీవలే కథనాలు వెలువడగా స్పందించిన జిల్లా కలెక్టర్ 20 రోజుల క్రితమే చెన్నూరు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ కు ఆక్రమ నిర్మాణాలను తొలగించి ఆ స్థలాన్ని ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తూ ఆక్రమణదారులకు సహకరిస్తున్నారంటూ స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పట్టణ కేంద్రంలో బీసీ వసతి గృహంతో పాటు పలు అభివృద్ధి పనులకు ఈ స్థలం ఎంతో అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా నిద్రావస్థను వీడి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులకు ఆ స్థలాన్ని వినియోగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## 11 కెవీ విద్యుత్ షాక్‌తో కేబుల్ ఆపరేటర్ మృతి



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలం రాంపూర్ తిమ్మాపూర్ గ్రామాల సమీపంలో బుధవారం 11 కెవీ విద్యుత్ షాక్‌కు గురై కేబుల్ ఆపరేటర్ దుర్గం పోచయ్య (43) మృతి చెందాడు. జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం నాగసముద్రం గ్రామానికి చెందిన దుర్గం పోచయ్య వృత్తిరీత్యా కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రాంపూర్‌తిమ్మాపూర్ గ్రామాల వద్ద డిష్ కేబుల్ వైర్ కింద పడిపోవడంతో దానిని సరిచేసే పనిలో భాగంగా విద్యుత్ స్తంభం వద్ద కేబుల్ లాగుతున్నాడు. ఈ క్రమంలో కేబుల్ వైర్ ప్రమాదవశాత్తు 11 కెవీ విద్యుత్ లైన్‌కు తగలడంతో పోచయ్య తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని వాహనంలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి తీసుకెళ్తున్న మార్గమధ్యంలోనే పోచయ్య మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

### తెలంగాణ రక్షణ సేన సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి కావేటి సబితమనోహర్

**ప్రజాపక్షం / కాగజ్ నగర్:** సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి కావేటి సబితమనోహర్ డిమాండ్ చేశారు. తెలంగాణ సచివాలయంలో కార్మికశాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిచందనను తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నేతలు ఎల్ రూప్సింగ్, సయ్యద్ ఇస్మాయిల్ తో కలిసి ఆమె బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కావేటి సబితమనోహర్ మాట్లాడుతూ మిల్లు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నేటికి 50వ రోజుకు చేరుకున్నాయని తెలిపారు. మిల్లులో 373 మంది శాశ్వత కార్మికులు, కంపెనీలోని అన్ని విభాగాల్లో కలిపి సుమారు 2,000 మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. మిల్లులో గుర్తింపు సంఘం లేకపోవడంతో కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## డిపిఆర్ఓ సంపత్ కుమార్ సేవలు అభినందనీయం

### టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సుకు హాజరైన జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) సంపత్ కుమార్‌ను టియుడబ్ల్యుజె (ఐజెయు) ఆధ్వర్యంలో బుధవారం ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ మారుమూల జిల్లా నుంచి జాతీయ సదస్సుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రభుత్వానికి, విలేకరులకు మధ్య ఆయన వారధిగా నిలుస్తున్నారని కొనియాడారు. దేవునూరి రమేష్, శ్రీధర్, నగరారే తారు, సురేష్ చారి, రాధాకృష్ణ చారి, రాజు, జానకి రామ్, నితీష్, మోహన్, నరేష్ పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ప్రజా ప్రభుత్వం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.5,69,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఆపదలో ఉండి వైద్యం కోసం నిరుపేదలు పడే ఇబ్బందులను గమనించి, వారికి తక్షణ ఆర్థిక భరోసా కల్పించడంలో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తమ వంతు బాధ్యతగా పనిచేసి ఆదుకోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసినందుకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, ఆడే గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోతరెడ్డి, నాయకులు అనుపట్ల సంజీవ్, మురళి గౌడ్, వినోద్, నారాయణ సింగ్, ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** రిమ్స్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం రిమ్స్ కరోనా ఓపీ ఎదుట గంటపాటు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ ఏజెన్సీని రద్దు చేసి ఏడాదిన్నర అవుతున్నా కొత్త కాంట్రాక్టర్‌ను నియమించకుండా రిమ్స్ డైరెక్టర్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నెలనెలా వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించడంతో పాటు కార్మికులకు వెంటనే యూనిఫామ్‌లు ఇవ్వాలన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి కొత్త కాంట్రాక్టర్‌ను నియమించాలని, లేనిపక్షంలో జూలై 9న హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.యూనియన్ నాయకులు నల్ల శివన్న, డోంగ్రే చందు, ఎండీ ముజీబ్, ఎస్కే ఇక్బాల్, కార్మికులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే, బుద్ధిస్ట్, మహార్ కులస్తులు

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో బుద్ధిస్ట్ మెమోరియల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలిశారు. మహార్ కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ ద్వారా జారీ చేయాలని, కులగణనలో నమోదైన ఎస్సీ బుద్ధిస్టుల డేటాను వెబ్‌సైట్‌లో ఉంచాలని, బుద్ధ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు. ఈ డిమాండ్లపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే చీఫ్ సెక్రటరీ ద్వారా అవసరమైన ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే, రాష్ట్ర కన్వీనర్ ప్రజ్ఞాకుమార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు వాగ్మరే భీంరావు, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కొల్టక్కర్ పరమేశ్వర్, ఇంద్రవెల్లి అధ్యక్షుడు సొంకాంబ్లే జితేందర్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఎఎంసి సెక్యూరిటీ గార్డ్ మృతి

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీయార్డులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బొమ్మల ప్రభాకర్ మృతిచెందినట్లు స్థానిక ఎస్సై తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన ఎప్పటిలాగే మార్కెట్ యార్డులో విధుల్లో ఉండగా అర్ధరాత్రి ప్రభాకర్‌కు ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు ఆయనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కొరకు బాన్సువాడ ఆసుపత్రికి రిఫర్ చేశారు. బుధవారం ఏఎంసీ చైర్మెన్ మనోజ్, వైస్ చైర్మెన్ కృష్ణరెడ్డి, ఏఎంసీ సెక్రెటరి శ్రీకాంత్‌లు ప్రభాకర్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించడమే కాకుండా వారి కుటుంబీకులకు తమ సానుభూతి తెలియజేశారు.

# బడి కాదు.. దోపిడీ అడ్డా!

-పుస్తకాల ముసుగులో కార్పొరేట్ మాఫియా గుప్త దందా..!

-నిర్మల్‌లో ప్రైవేట్ స్కూళ్ల అండర్ గ్రౌండ్

**ప్రజా పక్షం/నిర్మల్ :** విద్యను పవిత్రమైన విధిగా భావించే సామాజిక వ్యవస్థను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పూర్తిగా భ్రష్టు పట్టించాయి. అక్షరాలను అంగడి సరుకుగా మార్చేసి, చదువుల పేరుతో సాగిస్తున్న ఈ యాజమాన్యాల నిలువు దోపిడీ, అక్రమ భాగవతం ఇంతా అంతా కాదు. నిబంధనల ప్రకారం పాఠశాల ఆవరణలో పుస్తకాలు, యూనిఫారాలు, ఇతర విద్యా సామాగ్రిని అమ్మకూడదన్న ప్రభుత్వ కఠిన ఆదేశాలను ఈ విద్యా వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. గతంలో పాఠశాలల్లోనే నేరుగా విక్రయాలు జరిపినప్పుడు విద్యార్థి సంఘాలు తిరగబడి ఆందోళనలు చేపట్టడంతో, ఈసారి సదరు కార్పొరేట్ గద్దలు చట్టాల కళ్లు గప్పి సరికొత్త 'అండర్ గ్రౌండ్' పంథాకు తెరలేపడం తీవ్ర కలకలం రేపుతోంది.విద్యార్థి సంఘాల కళ్లు కప్పేందుకు, విద్యాశాఖ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిర్మల్ పట్టణంలో ఓ ప్రైవేట్ భవనాన్ని ఈ యాజమాన్యాలు రహస్యంగా కిరాయికి తీసుకున్నాయి. పాఠశాలకు ఎలాంటి సంబంధం లేనట్లుగా బుక్స్ అన్నింటినీ ఆ గుప్త భవనంలో భారీగా డంప్ చేశారు. స్కూలు ఆవరణలో కేవలం అడ్మిషన్లు, ఫీజుల ప్రక్రియ ముగించి, తల్లిదండ్రులకు రహస్య కోడ్‌లతో కూడిన టోకెన్లు ఇచ్చి ఆ సీక్రెట్ అడ్డాలకు పంపుతున్నారు. అక్కడ ఒక్కో విద్యార్థి నుండి కేవలం ఒక సెట్



పుస్తకాల పేరుతో ఏకంగా రూ. 8,500 నుండి రూ. 9,000 వరకు గుంజుతూ జనాన్ని నట్టేట ముంచుతున్నారు. ఎవరైనా విద్యార్థి సంఘాలు లేదా బాధ్యతగల పౌరులు నిలదీస్తే.. మా స్కూల్లో ఒక్క బుక్ కూడా లేదు.. మాకేం సంబంధం, బయట ఎక్కడో కొనుక్కుంటున్నారు అంటూ దొంగ నీతులు చెబుతూ, తెరవెనుక కోట్ల రూపాయల చీకటి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు.

### సిండికేట్‌గా మారిన కార్పొరేట్ గద్దలు..!

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పేరుమోసిన శ్రీ చైతన్య, నారాయణ, గౌతమ్ మోడల్ స్కూల్స్, మేధా మోరల్, శాంతినికేతన్, వాసవి, విజయ స్కూల్, సెంట్ థామస్ వంటి పాఠశాలల యాజమాన్యాలు ఏకంగా ఒక బలమైన సిండికేట్‌గా ఏర్పడి ఈ దోపిడీకి ఒడిగట్టాయి. మార్కెట్లో తక్కువ ధరకు లభించే సాధారణ పుస్తకాలను, నాణ్యత లేని కాగితాలు మరియు కక్కుర్తి బైండింగ్‌తో తమ సొంత పబ్లికేషన్ల ముసుగులో ఆకాశాన్నంటే ధరలకు అమ్ముతూ, మధ్యతరగతి, పేద కుటుంబాల నడ్డి విరుస్తున్నాయి. తమ పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి ఫీజులు కడుతున్న తల్లిదండ్రులకు ఈ అదనపు పుస్తకాల దోపిడీ గుండెకోతను మిగుల్చుతోంది.ఈ విద్యా సంస్థలు ఇంత తెగింపుతో, బరితెగించి వ్యవహరించడానికి జిల్లా విద్యాశాఖ అధికారుల సపోర్ట్ పూర్తిగా ఉందనే ప్రచారం జిల్లా వ్యాప్తంగా బలంగా సాగుతోంది. తాము జిల్లా అధికారులకు 'లక్షల రూపాయల మూటలు' నైవేద్యంగా కట్టబెట్టామని, తమను ఎవరూ ఏమీ చేయలేరని సదరు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలే స్వయంగా అంతర్గత సంభాషణల్లో బహిరంగంగా చెప్పుకురావడం విద్యాశాఖ లంచగొండితనానికి, దిగజారుడుతనానికి పరాకాష్టగా నిలుస్తోంది.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిఘా వర్గాల (ఇంటెలిజెన్స్) ద్వారా విచారణ జరిపించి, నిబంధనలను తుంగలో తొక్కిన స్కూల్ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారికి సహకరిస్తున్న విద్యాశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నాయి.

## సి.పి.ఎస్.రద్దుకు త్వరలో ఆమరణ దీక్ష


రాష్ట్ర అధ్యక్షుడు సి.పి. యస్.కృష్ణారావు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి(సి.పి.యస్.) పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ త్వరలో హైదరాబాదులో ఆమరణ దీక్షకు కూర్చుంటామని సి.పి.యస్. టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సి.పి.ఎస్. కృష్ణారావు పేర్కొన్నారు.గత 15 సంవత్సరాలుగా సి.పి.ఎస్. రద్దు కోసం పోరాడుతున్నామని, అనేక మైనటువంటి కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సి.పి.ఎస్. రద్దు చేస్తారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో స్పష్టమైనటువంటి హామీని ఇచ్చారని గుర్తు చేశారు.సి.పి.యస్.ఉద్యోగులు ముఖ్యమంత్రిపై భారీగా ఆశలు పెట్టుకున్నామని,పాత పెన్షన్ విధానాన్ని త్వరలో తెలంగాణలో అమలు చేస్తారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.సి.పి.యస్ ఉద్యోగులకు సంబంధించినటువంటి డి. ఏ . ఏరియర్స్ కొన్ని విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తారు. మిగిలిన బకాయిలను ఈనెల విడుదల చేసే బిల్లుల్లో పూర్తి మొత్తంలో చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా హైదరాబాదులో ఆమరణ నిరాహార దీక్షతో పాటు. .జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు కూడా ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం త్వరలోనే సి.పి.యస్ రద్దు కార్యాచరణ ప్రారంభిస్తుందనే ధీమాను వ్యక్తం చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సి. పి.యస్ .రద్దును స్పష్టంగా పేర్కొందని, కానీ కొందరు ప్రభుత్వ ప్రతిష్ట దిగజార్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు.



## పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలు.. పట్టించుకోని అధికారులు!

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజల పన్నుల రూపంలో వచ్చే ప్రతి రూపాయి ఎంతో అమూల్యమైనది. రాత్రి వేళల్లో ప్రజల భద్రత, సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వీధి దీపాలు, నిర్మల్ పట్టణంలోని పలు కాలనీలలో పట్టపగలు కూడా నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. పగటి పూట కూడా ఇలా లైట్లు వెలగడం వల్ల భారీగా విద్యుత్ వృథా కావడమే కాకుండా, ప్రజాధనం తీవ్రంగా దుర్వినియోగం అవుతోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై గతంలో ప్రజా పక్షం లో కథనాలు ప్రచురితమైనప్పటికీ, మున్సిపల్ మరియు విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. కాలనీవాసులు అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు.విద్యుత్ ఆదా చేయడంతో పాటు ప్రజాధనాన్ని సంరక్షించడానికి అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీధి దీపాలకు ఆటోమేటిక్ టైమర్లు లేదా వెలుతురును బట్టి పనిచేసే



సెన్సార్ల వ్యవస్థను ఏర్పాటు చేసి, వాటిని సమర్థంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సాంకేతిక లోపాలను వెంటనే గుర్తించి సరి చేయడం ద్వారా ఈ వృథాను అరికట్టవచ్చు. ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు కూడా బాధ్యతగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మల్ పట్టణంలో ప్రజాధనం వృథా కాకుండా కాపాడాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రిన్సిపాల్‌పై దాడిని ఖండిస్తూ అధ్యాపకుల నిరసన

**ప్రజా పక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసాలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల సందర్భంగా చోటుచేసుకున్న దుర్ఘటనను అధ్యాపకులు, సీపీడీసీ సభ్యులు తీవ్రంగా ఖండించారు.కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య జూలై 7, 2026 మంగళవారం సాయంత్రం సుమారు 4:45 గంటలకు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తుండగా,ఒక విద్యార్థి కాపీ కొడుతున్నట్లు గుర్తించి అతని ఆన్సర్ బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ విద్యార్థి ఆగ్రహానికి లోనై ప్రిన్సిపాల్ చేతుల నుంచి ఆన్సర్ బుక్‌ను బలవంతంగా లాక్కొని చించి వేసి, అనంతరం ప్రిన్సిపాల్‌పై భౌతిక దాడికి పాల్పడ్డాడు.ఈ ఘటనను అడ్డుకునేందుకు అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు, కళాశాల సిబ్బంది ప్రయత్నించగా వారిని కూడా తోసివేసి, సమీపంలోని గోడపై నుంచి దూకి పరారయ్యాడు.



ఈ ఘటనపై కళాశాల అధ్యాపక బృందం, సీపీడీసీ అధ్యక్షులు డాక్టర్ నాగేష్ ,జనరల్ సెక్రెటరీ మనోజ్ తదితరుల ఆధ్వర్యంలో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసు అధికారులకు అందజేయగా, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

## వై. యస్.ఆర్.సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/బోథ్‌బోథ్ :** మార్కెట్ యార్డ్ లో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఫోటోకి పువ్వులమాలలు వేసి నివాళులర్పించిన ఏ.యం. సి.చైర్మన్ మల్లెపూల సత్యనారాయణఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దైవం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదల పక్షపాతం ఎన్నో అభివృద్ధి పనులు ఆరోగ్యశ్రీ ప్రధాత పేద పిల్లల చదువుల కోసం ఫీజు రీయింబర్స్మెంట్ ను తీసుకువ



చ్చిన నాయకులు,కాంగ్రెస్ పార్టీకి ఎనలేనిసేవలు చేశారని గుర్తు చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గుర్తుంచుకునే నాయకుడు అని తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**ప్రజాపక్షం / కోటపల్లి :** కోటపల్లిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను బిజెపి మండల జనరల్ సెక్రెటరీ కందుల వెంకన్న ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు దొడ్డు బియ్యంతో అన్నం వండుతుండటంతో వారు భోజనం తినలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే చొరవ తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఎస్టీ మోర్చా మహేష్, అధ్యక్షుడు కాశెట్టి రాకేష్, నాయకులు పెద్దింటి పున్నం చందు, పూజారి సమ్మయ్య పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణ ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్నటువంటి అసంపూర్తిగా ఉన్నటువంటి అపార్ట్మెంట్లో గుర్తు తెలియని ఒక వృద్ధుడు మృతి చెందిన విషయం తెలుసుకొని సంప్రదాయం ప్రకారం దగ్గరుండి గోదావరి నది తీరం వద్ద అంత్యక్రియలు జరిపించిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ తొడసం ఇందిరా,ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్,బిజెపి నాయకులు కొండ వేణి రమేష్,దాసరి శ్రీనివాస్,దానవెల్లి సుధాకర్,మున్సిపాలిటీ సిబ్బంది,పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ ) ను గ్రామస్థులకు చేరవేయడంతో పాటు ఎన్యుమరేషన్ ఫారాలను నింపడానికి సహాయకరంగా ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ బండారి పుష్ప రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఓటర్లు ఎస్ఐఆర్ నమోదుకు సంబంధించిన సేవలను గ్రామ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్,ఉప సర్పంచ్ విజయ పకీర్ సింగ్, జీపీవో ప్రెసిల్ల,బీఎల్ వో రవీందర్, ఎఫ్ఏ పిర్యా, వంశీ,ప్రసాద్, మొగిలి,శారద,లత,తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేత

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కును అర్హులైన లబ్ధిదారునికి టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, బోథ్ మండల కన్వీనర్ మెరుగు భోజన్న అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బోథ్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ సాయన్న, రహీంద్దీన్,ఎం.డి. అబ్రార్,బీమ బుచ్చన్న,బీరం రవి, పాల్గొన్నారు.

## ఘనంగా వైయస్ఆర్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ముధోల్ :** అభివృద్ధి ప్రధాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఆయన జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా, ఒక నాయకుడిగా రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. దేశంలోనే అమూల్యమైన 108 వంటి పథకాలను అమలు చేసిన ఘనత ఆయనదని గుర్తుచేశారు. శ్రీనివాస్,అజీజ్,గోవింద్ పటేల్,దిగంబర్,పల్లోళ్ళ నాగేష్,కిషన్ పతంగే, పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి

పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపిన రైతులు

**ప్రజాపక్షం/ముధోల్ :** రైతుల సంక్షేమం కొరకు అహర్నిశలు కృషి చేస్తున్న పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ముధోల్ మండల కాంగ్రెస్ నాయకులు పోతన్న యాదవ్ స్పష్టం చేశారు.6 రోజులలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేసినందుకు బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే అనేక పథకాలను అమలు చేసినందుకు ప్రజలు గుర్తించాలని వెల్లడించారు.రాబోయే రోజుల్లో రాష్ట్రాభివృద్ధి కొరకు మార్గనిర్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకెళ్తోందన్నారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.బషీర్,విశ్వంబర్,సంజు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## 23లోగా ఎన్యుమరేషన్ ఫామ్‌లను తప్పనిసరి సమర్పించాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ప్రజాపక్షం/భీమ్‌గల్ : నియోజకవర్గ పరిధిలోని ప్రతిఒక్కరూ తమ ఓటరు వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తన స్వగ్రామమైన వేల్పూర్‌లో తహసీల్దార్ సమక్షంలో బూత్ లెవల్ అధికారులకు తన వ్యక్తిగత ఓటరు వివరాలను స్వయంగా అందజేశారు. ఒక ఫారాన్ని అధికారులకు సమర్పించి, రసీదుగా మరో ఫారాన్ని తన వద్ద ఉంచుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా సర్ ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఓటరు తమ వివరాలను ఈనెల 23 లోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, బీఎల్ఓలు ఇంటికి వచ్చినప్పుడు ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి వారికి ఇవ్వాలన్నారు. నమోదులో రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు కూడా సహకరించాలని కోరారు. ఏ ఒక్క ఓటు మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లే సమయంలో ఏజెంట్లు కూడా వారితో పాటు వెళ్లి ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా చూడాలని ప్రతిఒక్కరితో ఓటరు వివరాలు నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ అనిరుధ్, బీఎల్ఓలు, సర్పంచ్ అశోక్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ

ప్రజాపక్షం/బాల్కొండ : పలు ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలలు కొన్ని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకోవటంపై ఎంఈఓ బట్టు రాజేశ్వర్ ఆకస్మిక తనిఖీల ద్వారా గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు అందజేశామన్నారు. సెయింట్ ఎలిజబెత్ కిసాన్ నగర్ పాఠశాల ప్రభుత్వ సమయ వేళలు పాటించకపోవటం, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకి ఫోన్ చేసి చెపిప ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంట వరకు చిన్నారులకు తరగతులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేయగా ఇది వాస్తవమేనని ఎంఈఓ తనిఖీలో తేలింది. అలాగే మండల కేంద్రంలోని సెయింట్ అలియుద్దీన్ ప్రాథమికోన్నత పాఠశాలలో 17 మంది ఉపాధ్యాయులలో కేవలం ముగ్గురు మాత్రమే క్వాలిఫైడ్‌గా గుర్తించటం జరిగింది. షోకాజ్ నోటీసులు అందజేశారు. మండలంలో ఏవైనా ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# శ్రీ మహా పోచమ్మ దీవెనలు ఎవరికో...?

### వర్గ పోరు తప్పదా?
### ఆలయ చైర్మన్ పై ఔత్సా హులకు ఉత్కంఠ




ప్రజాపక్షం/సారంగాపూర్ : రాష్ట్రంలోప్రసిద్ధిగాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయ చైర్మన్ పదవి ముగిసి మూడు నెలలు గడిచింది. దీంతో నూతన చైర్మన్ పై ఔత్సాహకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు దేవదాయ శాఖ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అనుచరులు ప్రయత్నిస్తుండగా మరోవైపు మాజీ డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు అనుచర వర్గం ప్రయత్నాలు చేస్తున్నాయి.గత చైర్మన్ సింగం లక్ష్మీ నారాయణ గౌడ్ ఈ వర్గం, ఆ వర్గం పై ఆధారపడకుండా ఏకంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారంతో కుర్చీపై ఆసీనులైన ఈయన మరోసారి ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అనుచరులగు అడెల్లి మాజీ సర్పంచ్ సుచరిత రాజేశ్వరరావు మాజీ మంత్రి వెంటే ఉంటూ అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ చైర్మన్ పదవిపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు శ్రీహరి రావు అనుచరులైనటువంటి చించోలి ఎం గ్రామానికి చెందిన దాసరి రమేష్ ఉద్యమంలోనూ, కష్టకాలంలోనూ వెంటే ఉన్నటువంటి ఈయనపై అవకాశాలు చాలానే ఉన్నాయని మండలంలోని పార్టీ శ్రేణులు,అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తుండగా ఇంకో దిక్కు గత అసెంబ్లీ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొన్నటువంటి నవీన్ రెడ్డి తో పాటు ఇటీవలే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నటువంటి సామల వీరయ్యలు ప్రయత్నాలు చేస్తున్నారు. వర్గ పోరు తప్పదా...? రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మాజీ మంత్రివర్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు మధ్య అంతర్గత వర్గ పోరు జిల్లాలో కొనసాగుతూనే ఉంది. గతంలోనూ చైర్మన్ పదవులు దక్కించుకోవడంలో ఎవరి ప్రయత్నాలు వారు చేయగా ఈసారి కూడా అదే విధంగా కొనసాగుతుందని జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆలయానికి పట్టిన బూజు దులపగలరా..? నూతనంగా కృష్ణ శిలలతో ఆలయాన్ని సుందరీకరించినా నిర్వహణ లోపం మాత్రం అంతకంతకు పెరిగిపోతుంది. రెగ్యులర్ ఈవో లేకపోవడంతో గ్రామంలోని కొందరు ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం పెరిగిపోతుండగా మరోవైపు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వార వారం వేల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు కొత్తగా నియమితులయ్యే చైర్మన్ ఇలాంటి బూజును దులపగలరు, దేవదాయ శాఖ ద్వారా లేదా కాగితాలపై, శిలాఫలకాలపై తమ పేరుకే నమోదు అవుతారా వేచి చూడాల్సి ఉంది.

## నిరుద్యోగులకు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

### మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ (national egg co ordination committee) వారి సౌజన్యంతో నిర్మల్ పట్టణంలోని వశిష్ఠ విద్యా సంస్థలు, అభిరాం ఫ్యూయల్స్ సహకారంతో సోన్ మండలం కడ్తాల్ అభిరామ్ పెట్రోల్ బంక్ ఆవరణలో బుధవారం నిరుద్యోగులకు, చిరు వ్యాపారులకు 20 మందికి తోపుడు బండ్లను ,సిలిండర్ ఇతర సామాగ్రిని నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా పంపిణీ చేసిన ఈ తోపుడు బండ్లను సద్వినియోగం చేసుకోవాలని, వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు. పోషకాహారాన్ని అందించే గుడ్డు యొక్క ప్రాముఖ్యత ను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. సంస్థ అందిస్తున్న సహకారాన్ని వివరించాలని సూచించారు.భారతదేశంలోని పౌల్ట్రీ రైతులు నిరుద్యోగులకు సహాయం చేయడానికి స్థాపించిన జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ అని పేర్కొన్నారు.ఈ సంస్థలో దేశవ్యాప్తంగా 35 వేల మంది సభ్యులు కలిగిన సంస్థ అని తెలిపారు. పౌల్ట్రీ వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థ అన్నారు. ఎన్ ఈ సి సి సంస్థ సామాజిక బాధ్యతగా నిరుద్యోగులకు ఈ రకమైన సహాయ సహకారాలు అందిస్తుందని సంస్థ గొప్పతనాన్ని వివరించారు. తోపుడు బండ్లు తీసుకున్న లబ్ధిదారులు తమ జీవనోపాధికి ఉపయోగపడుతున్న సంస్థకు, వశిష్ఠ విద్యాసంస్థల డైరెక్టర్ వి .సత్యనారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు మంజులాపూర్ వైస్ చైర్మన్ బర్మ గంగాదాసు కొండాపూర్, రత్నాపూర్ kandlee మాజీ సర్పంచులు నవత్ గంగాధర్, ఫీచర్ శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు రమణ గౌడ్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## దళిత కాలనీలో సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం సర్వే



ప్రజా పక్షం/ఖానాపూర్ : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణ గాంధీ నగర్ దళిత కాలనీలో సర్వే నిర్వహించడం జరిగింది.కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ గాంధీనగర్ ఖానాపూర్ పట్టణంలో ఉన్నప్పటికి 600 కు పైగా ఓట్లు కలిగి ఉన్న రేషన్ షాపు లేకపోవడం వలన కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది ఎదురుకుంటున్నారు.కిలోమీటర్ దూరంలో ఉన్న శాంతినగర్ కి వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుంది.శాంతినగర్ నుండి గాంధీనగర్ కు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.పెన్షన్ రానటువంటి వికలాంగులు,వితంతువులు,బీడీ కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు నోచుకోని వారు అనేకమంది ఉన్నారు. ఇంటి జాగా కలిగి ఉండి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్న పేదలు ఉన్నారు.గాంధీనగర్ దళిత పేదల సమస్యల్ని పరిష్కరించాలని ఇందిరమ్మ ఇండ్లు ,పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లు ఈ సమస్యలపై ప్రభుత్వ అధికారులు స్పందించి పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో దరఖాస్తులు పెట్టించి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్,జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఖానాపూర్ మండల అధ్యక్షులు పొనగంటి నరేష్ కుమార్,ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు చింతల పల్లె శంకర్ ,ఖానాపూర్ మండల ఉపాధ్యక్షులు నాగుల నర్సా గౌడ్,మండల నాయకులు చింత కుంట శంకర్,కాలనీవాసులు నారపాక నర్సయ్య,నరు కుంట్ల రమేష్,నారపాక లావణ్య,వద్యాల వనిత,కూరెల్లి వనిత,తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ దాడి ఘటనపై ఐడి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధాకర్ విచారణ

ప్రజాపక్షం/భైంసా : గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్యపై ఇటీవల జరిగిన దాడి ఘటనకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాస్తవ వివరాలను సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌తో ప్రొఫెసర్ ఎం సుధాకర్ కళాశాలను సందర్శించారు. వారు ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్యను కలిసి ఘటన జరిగిన పరిస్థితులు,దానికి దారితీసిన అంశాలు,అనంతరం తీసుకున్న చర్యల గురించి సమగ్రంగా వివరాలు తెలుసుకున్నారు.ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్య జరిగిన సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వారికి వివరించారు. కళాశాలలో విద్యా వాతావరణం,అధ్యాపకులు విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ప్రతినిధి బృందం అభిప్రాయపడింది.ప్రభుత్వ విద్యాసంస్థల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు,ప్రిన్సిపాల్లపై ఇటువంటి ఘటనలు జరగడం బాధాకరమని, విద్యా వ్యవస్థ గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సేకరించిన నివేదికను సంబంధిత అధికారులకు సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు,సిబ్బంది కూడా హాజరై సంఘటనపై తమ అభిప్రాయాలను తెలియజేశారు.

## ఘనంగా వైఎస్సార్ జయంతి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం వైఎస్సార్ 77వ జయంతిని ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అనంతరావు, జనార్దన్, అంజుమ్, బలరాం, మహేష్, నవీన్, అనిల్, బొర్రన్న పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవ గాహన

ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో స్టూడెంట్స్ కౌన్సిలింగ్‌లో భాగంగా రక్షక శాఖ వారిచే రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం మన ఊరు మన భద్రత, మన బాధ్యత కార్యక్రమం బుధవారం నిర్వహించగా జిల్లా ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నాయో వివరిస్తూ చాలామంది వేగంగా వాహనాలను నడుపుతూ ప్రాణాలను కోల్పోతున్నారని, వేగంగా నడపటం మంచిది కాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా వాహనం నడపరాదని అంతేగాక మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణం కొనసాగించాలన్నారు.నర్సింహా స్వామి, శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రకు తరలిరావలి

### అర్బన్ ఎమ్మెల్యే

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఇస్కాన్ జగన్నాథ రథయాత్రకు భక్తులు భారీగా తరలిరావలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసి మాట్లాడారు. నగరంలోని కంఠేశ్వర్ ఆలయం నుంచి ఈనెల 24న రథయాత్ర ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించే రథయాత్రలో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఇస్కాన్ సేవలు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాలని కొనియాడారు. నీలకంఠేశ్వరాలయం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర నగరంలోని ప్రధాన వీధుల గుండా తిరిగి కంఠేశ్వర్‌లోని శ్రీరామ గార్డెన్‌కు చేరుకుంటుందన్నారు. ఇస్కాన్ కంఠేశ్వర వ్యవస్థాపక అధ్యక్షులు రామానంద రాయి గౌరదాస ప్రభుజి, నిత్యచాంద్ ప్రభుజి, బలరాం ప్రభుజి, బీజేపీ కార్పోరేటర్లు నాగోల్ల లక్ష్మీ నారాయణ, బెల్లాల్ శశాంక్, సీనియర్ నాయకులు స్వామియాదవ్, రఘుపతిగౌడ్, రోహిత్ ప్రభుజి, సునీల్ ప్రభుజి, భార్గవ్ ప్రభుజి పాల్గొన్నారు.



# ఉచిత వైద్యశిబిరం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** మండలంలోని బెజ్జోరా గ్రామపంచాయతీలో నిజామాబాద్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రజలకు బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు, ఈసీజీతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలందించారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ కార్తీక్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలనే లక్ష్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సేవలను వినియోగించుకున్నారని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సర్పంచ్‌కు సేవలందించిన వైద్య బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్య బృందం, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, పంచాయతీ సిబ్బంది, గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# అధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో మార్పు

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, మానవత్వాన్ని పెంపొందిస్తాయని ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి రఘు అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆర్మూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అయ్యప్ప స్వామి వారి ఆశీస్సులతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మురళి, రవి, జనార్ధన్‌గౌడ్, దత్తు, సుధాకర్, అశోక్, స్వామి, శ్రీహరి, విజయ్, రాజేశ్వర్, నరేష్, సుమన్, ప్రసాద్, శ్రీనివాస్, గంగాధర్, ప్రసాద్, నందు, గంగాధర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చటమే లక్ష్యంగా పని చేయాలంటూ వినతి

**ప్రజాపక్షం/ఆర్మూర్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అమరజ్యోతి కార్యాలయంలో విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమ నాయకుల సంప్రదింపుల సమావేశ నిర్వహించారు. ఈ కీలక సమావేశానికి టియు విద్యార్థి ఉద్యమ నాయకులు అధికారికంగా హాజరయ్యారు. ఈసందర్భంగా కెకె కమిటీ చైర్మన్ కేశవరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంలను విద్యార్థి నాయకులు కలిసి అభిప్రాయాలు, కీలక సూచనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్రను గుర్తు చేస్తూ ఉద్యమకారుల దశాబ్దాల ఆకాంక్షలను నెరవేర్చేలా తగిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, ప్రదీప్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీన్, శ్రీకాంత్, చరణ్, లాలసింగ్ లు పాల్గొని తమ గళాన్ని వినిపించారు.



# ‘సర్’ సర్వే ప్రక్రియ 100 శాతం జరిగేలా చూడాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ మండలాల్లో 100 శాతం సక్రమంగా జరిగేలా చూడాలని డీసీసీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి కోరారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ నియోజక వర్గాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో డీసీసీ కార్యవర్గంలోని ఉపాధ్యక్షులకు, ప్రధా కార్యదర్శులకు, కార్యదర్శులకు వివిధ మండలాల్లో సర్ ప్రక్రియ కోసం బాధ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా నగేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే కొనసాగుతున్న సందర్భంగా ప్రతి మండలంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తమ తమ మండలాల్లో సర్వే ప్రక్రియ 100 శాతం సక్రమంగా జరిగేలా చూడాలని ఏ ఒక్క ఓటు కూడా పోకుండా అందరూ ఎన్యుమరేషన్ ఫామ్‌లు నింపేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా ప్రతి మండలంలో బూత్ లెవల్ ఏజెంట్లతో




సమావేశాలు నిర్వహిస్తూ ప్రతి బూత్ లో ప్రజలకు ఎన్యుమరేషన్ ఫామ్‌లో నింపటంలో బిఎల్ సహాయ పడాలని ఇబ్బందులున్న దగ్గర పార్టీ నుంచి ఒకరిని బిఎల్ఓకు ఇచ్చి ఫారాలు నింపేలా చూడాలని ఈనెల 25 వరకు ప్రతిఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సర్వే ప్రక్రియలో చిత్తశుద్ధితో పాల్గొనాలన్నారు. జరగకుండా చూడాలన్నారు.బొబ్బిలి రామకృష్ణ, భక్తవత్సలం, తారాచంద్, రత్నాకర్‌గౌడ్, గోపి, రజితయాదవ్, పాషా, అమృతాపూర్ గంగాధర్, బాలరాజు, నరేష్, వెంకటరాంరెడ్డి, వీరాజు పాల్గొన్నారు.

# ఒక్క సిసి కెమెరాల 100 మంది పోలీసు సిబ్బందితో సమానం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసు సిబ్బందితో సమానమని నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని సీపీ సాయిచైతన్య అన్నారు.బుధవారం వర్ని పిఎస్ లోని శ్రీనగర్, జాకోర గ్రామపంచాయతీ కార్యాలయంలో మన ఊరు మన భద్రత లో భాగంగా 31 సీసీ కెమెరాలను సీపీ సాయిచైతన్య ప్రారంభించి మాట్లాడారు. ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం ఎంతో సంతోషమని, ఒక్క సీసీ కెమెరా అనేది వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలతో గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశముంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంవినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయ పడుతాయని వివరించారు. పోలీసు శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందు కొచ్చి భాగస్వాములు కావలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ వారి భద్రత కోసం సీసీ కెమెరాలను పెట్టాలని చెప్పారు. ఇది వారి బాధ్యతగా తీసుకోవాలని, దుకాణాల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. శ్రీనగర్‌లో 15, జాకోరా 16 కెమెరాలు ఏర్పాటు చేసి సహకరించిన గ్రామపంచాయతీలను సీపీ అభినందించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సిఐ కృష్ణ, ఎస్సైలు వంశీకృష్ణ, శ్రీనివాస్, మనోజ్, సర్పంచ్‌లు పూర్ణిమ కిరణ్, పెద్దసాయిలు, మాదాల చారి టబల్ ట్రస్ట అధ్యక్షులు సుబ్బారావు, సెక్రటరీ ఠాకూర్, తోట చేతన్‌కుమార్ ప్రజలు పాల్గొన్నారు.



# బోధన్ డివిజన్ ఆంగ్ల ఉపాధ్యాయులకు నేటి నుంచి వృత్యంతర శిక్షణ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** బోధన్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయులకు ప్రత్యేక వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములపల్లి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ డివిజన్‌లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 112మంది ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొననున్నారని తెలిపారు.ధునిక పద్ధతులు, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఉపాధ్యాయులందరూ సకాలంలో హాజరై దీనిని విజయవంతం చేయాలని హెచ్ఎం రవి కుమార్ కోరారు.

# అంబం(వై) యువకుడి మృతి కేసు

## ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసుల ముమ్మర విచారణ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని అంబం(వై) గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఓనే మహిపాల్(28) అనే యువకుడి మృతి కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. మొదట తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా అందిన పోస్టుమార్టం నివేదిక ప్రకారం మహిపాల్ ది హత్య కాదని, అది ఆత్మహత్యేనని ప్రాథమికంగా తేలిందని పోలీసులు స్పష్టం చేశారు. మహిపాల్ మరణానికి కోడలే కారణమంటూ మృతుడి తల్లి ఆరోపించడంతో ఈ కేసు పలు మలుపులు తిరుగుతోంది.

# ఓటర్ల జాబితా సవరణ పక్రియను త్వరగా పూర్తి చేయాలి

## ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎడపల్లి మండల తహసీల్దార్ దత్తాత్రి కోరారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్లు ఇచ్చిన ఫారాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 24వ తేది చివరి తేదని, చివరి వరకు వేచిచూస్తే సర్వర్ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముందుగానే ఫారాలను అందచేయడం ద్వారా ఆన్‌లైన్ ఇబ్బందులు తొలగి, తమ ఓటు హక్కును భద్రంగా ఉంచుకోగలుగుతారన్నారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీ సమయంలో అలసత్వం పనికిరాదు

## పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

**ప్రజాపక్షం/బోధన్:** వాహనాల తనిఖీలు 24/7 చేయాలని, వాహనాల తనిఖీల సమయంలో సిబ్బంది అలసత్వం పనికి రాదని నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సీపీ సాయి చైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే పండుగల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలని, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిర్విరామంగా దాడులు నిర్వహించి, అవసరం అయితే పిడి యాక్ట్ నమోదు చేయాలన్నారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బోధన్ డివిజన్ ఏసిపి శ్రీనివాస్, సిసి ఆర్ బి ఎ సిపి గురునాయుడు, సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ అంజయ్య, బోధన్ ఎస్‌హెచ్ఓ వెంకట్ నారాయణ, బోధన్ రూరల్ సిఐ విజయబాబు, ఎస్సైలు కృష్ణ, రాజశేఖర్, రమ, గంగాధర్, వంశీకృష్ణ, మనోజ్‌కుమార్, శ్రీనివాస్ యాదవ్, ఐటికోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండల కేంద్రంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి మాట్లాడారు. దారిద్ర రేఖలో ఉన్న నిరుపేద విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్ పై ఆశలు పెట్టుకొని కాలేజీలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. గత 202425 లో 6వేల కోట్లు, 202526లో నాలుగు వేల కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థులు పై చదువులు చదవాలన్నా ఫీజు రియంబర్స్‌పై ఆధారపడి ఉన్నారని దాసరి మూర్తి గుర్తు చేశారు. దీంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారన్నారు.

# నూతన బ్రిడ్జిపై గుంతల పూడ్చివేత

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో గల పాత బ్రిడ్జి పక్కనే నూతనంగా నిర్మించిన బ్రిడ్జిపై వర్షానికి గుంతలు ఏర్పడటంతో సర్పంచ్ బోగా ఆనంద్, బ్రిడ్జిపై ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామ పంచాయతీ సిబ్బందితో కంకర, సిమెంట్ పోయించి బ్రిడ్జిపై గుంతలను పూడ్చి వేయించారు. గ్రామంలో సర్పంచ్ ఆనంద్ ఎటువంటి పనైనా తొందర తొందరగా చేస్తున్నాడని, దీంతో గ్రామస్తులు మోర్తాడ్ సర్పంచ్ బోగా ఆనంద్ ను గ్రామ ప్రజలు, యువకులు అభినందించారు.

# విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోర్తాడ్ ఎస్సై రాము, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన శిక్షలు, విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలన్నారు. మంచి స్నేహాలను పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల్లో చైతన్యం కల్పించిన ఎస్సై రాముకు ప్రధానోపాధ్యాయులు ఎర్రోజి రఘునందన చారి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

